క్లుప్తంగా

మంత్రిని కలసిన సమన్వయకర్త



జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డిని కలసిన వీరాంజనేయులు

శింగనమల: జిల్లా పర్యటనకు వచ్చిన ఇన్‌చార్జ్ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, ఎంపీ మిథున్‌రెడ్డిని శనివారం అనంతపురంలో శింగనమల నియోజకవర్గ సమన్వయకర్త వీరాంజనేయులు, నాటక అకాడమి చైర్‌పర్సన్ ప్రమీల కలసి పుష్ప గుచ్ఛం అందజేసి, స్వాగతం పలికారు. వారి వెంట పలువురు నాయకులున్నారు.

రిజిస్ట్రేషన్ పత్రాల పంపిణీ



రిజిస్ట్రేషన్ పత్రాలు పంపిణీ చేస్తున్న దృశ్యం

గుత్తి: గుత్తి మున్సిపాలిటీ పరిధిలోని ఆర్‌ఎస్ 4వ వార్డు గ్రామ సచివాలయంలో శనివారం లబ్ధిదారులకు ఇంటి స్థలాల రిజిస్ట్రేషన్ పత్రాలు పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా జగనన్న కాలనీల్లో ఇల్లు నిర్మించుకున్న 110 మంది లబ్ధిదారులకు ఇంటి రిజిస్ట్రేషన్ పత్రాలు అందజేశారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ వన్నూర్‌బీ, వీఆర్వో అనూరాధ, కౌన్సిలర్ వరదరాజులు, సచివాలయ అడ్మిన్ ఫయాజ్, అంగన్‌వాడీ టీచర్ నాగలక్ష్మి, వెల్ఫేర్ అసిస్టెంట్ కౌశిక్, వైఎస్సార్ సీపీ నాయకులు కేఎం రంగనాయకులు, హరినాథ్ రెడ్డి, హరి, గాలీబ్ తదితరులు పాల్గొన్నారు.

'సీఏఏ అమలు విరమించుకోవాలి'

పామిడి: కేంద్రం వివాదస్పద పౌరసత్వ సవరణ చట్టం అమలు చేసే కుట్ర యత్నాన్ని విరమించుకోవాలని ఇన్సాఫ్ రాష్ట్ర నాయకుడు జాఫర్ డిమాండ్ చేశారు. శనివారం స్థానిక షాదీఖానాలో ఏర్పాటు చేసిన ఆల్ ఇండియా తంజీమ్ ఏ ఇన్సాఫ్ కమిటీ సమావేశానికి హాజరైన ఆయన మాట్లాడారు. బీజేపీ మతతత్వ పాలనతో సీఏఏ అమలు పరిచి దేశంలోని ముస్లిం మైనార్టీలకు అన్యాయం చేయడానికి తీవ్రంగా యత్నిస్తోందన్నారు. ఇన్సాఫ్ జిల్లా అధ్యక్షుడు గోల్డ్ బాషా, మండల అధ్యక్షుడు కే రహీం, సభ్యులు, ముస్లిం మైనార్టీ నాయకులు పాల్గొన్నారు.

ఎన్నికల నియమావళి ఉల్లంఘిస్తే కఠిన చర్యలు



మాట్లాడుతున్న ట్రైనీ డీఎస్పీ హేమంత్‌కుమార్

యాడికి: ఎన్నికల నియమావళిని ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తప్పవని ట్రైనీ డీఎస్పీ హేమంత్‌కుమార్ హెచ్చరించారు. శుక్రవారం మండల కేంద్రంలో పోలీసులు, కేంద్ర బలగాలతో కలిసి పోలీసు కవాతు నిర్వహించారు. అనంతరం చెన్నకేశవ స్వామి దేవాలయం ఎదురుగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఎన్నికల సమయంలో అల్లర్లకు పాల్పడినా, ఓటు హక్కును వినియోగించుకోకుండా ఓటర్లను ప్రలోభ పెట్టినా పోలీసులకు సమాచారం ఇవ్వాలన్నారు. సీఐ నాగార్జున రెడ్డి, యాడికి సీఐ రోషన్, పెద్ద పప్పూరు ఎస్‌ఐ శరత్ చంద్ర, ఏఎస్‌ఐ వెంకటేష్, పోలీసులు పాల్గొన్నారు.

పేకాటరాయుళ్ల అరెస్ట్

పెద్దవడుగూరు: చిన్నవడుదూరు, రావులుడికి గ్రామాల్లో శుక్రవారం రాత్రి పేకాట ఆడుతున్న 13 మందిని పోలీసులు అరెస్ట్ చేశారు. నిందితుల నుంచి రూ.23,300 నగదు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్‌ఐ శ్రీనివాసులు తెలిపారు.

పెన్షనర్ల సమావేశం

గుత్తి: పట్టణంలోని ప్రభుత్వ పెన్షనర్ల భవనంలో శనివారం పెన్షనర్లు సమావేశమయ్యారు. ఆ సంఘం అధ్యక్షుడు అబూ బకర్ మాట్లాడుతూ పెన్షనర్ల సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలన్నారు. సంఘం నాయకులు శామ్యూల్, మేస్త్రీ వెంకటేష్, రామ్మోహన్, కుల్లాయి బాబు తదితరులు పాల్గొన్నారు.

శివరాత్రి శోభ

మహా శివరాత్రి ఉత్సవాల్లో భాగంగా గుంతకల్లు, తాడిపత్రి, శింగనమల నియోజకవర్గాల్లో ఆధ్యాత్మిక శోభ నెలకొంది. రథోత్సవాలు, కల్యాణోత్సవాలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా శివనామస్మరణతో ఆలయాలు మార్మోగాయి.



గుంతకల్లులో స్వామికి అభిషేకం నిర్వహిస్తున్న ఎమ్మెల్యే వైవీఆర్

- ఘనంగా సంగమేశ్వరుడి రథోత్సవం
- కనుల పండువగా శివపార్వతుల కల్యాణోత్సవం



గుంతకల్లు రూరల్: రథోత్సవం నిర్వహిస్తున్న దృశ్యం

గుంతకల్లు రూరల్/టౌన్: దక్షిణ కాశీగా ప్రసిద్ధి చెందిన బుగ్గ సంగమేశ్వర ఆలయంలో శనివారం సాయంత్రం పార్వతీ, సంగమేశ్వరుల రథోత్సవం ఘనంగా నిర్వహించారు. సుదూర ప్రాంతాల నుంచి తరలివచ్చిన భక్తుల శివనామస్మరణతో ఆలయ పురవీధులు మార్మోగాయి. శివరాత్రి ఉత్సవాల్లో భాగంగా శనివారం వేకువజామున కల్యాణోత్సవం నిర్వహించారు. సాయంత్రం 6 గంటలకు పార్వతీ సంగమేశ్వరుల రథోత్సవం వైభవంగా చేపట్టారు. మున్సిపల్ వైస్ చైర్మన్ నైరుతి రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. అలాగే కొనకొండ్లలోని ఛాయమల్లేశ్వరస్వామి ఆలయంలో ఎమ్మెల్యే వై.వెంకటరామిరెడ్డి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఎమ్మెల్యేతో పాటు పార్టీ నియోజకవర్గం ఎన్నికల పరిశీలకుడు వై.భీమిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వైభవం.. కోన రామలింగేశ్వరుడి రథోత్సవం

యాడికి: కోన క్షేత్రంలో రామలింగేశ్వరుడి రథోత్సవం శనివారం వైభవంగా సాగింది. తిరునాలలో భాగంగా ఆలయ ప్రాంగణంలో వేకువజామున శివపార్వతుల కల్యాణోత్సవం జరిపించారు. అనంతరం అర్చకులు, కోనా బ్రదర్స్ జగదీశ్వరరెడ్డి, వెంకటశివారెడ్డి, దేవనాథరెడ్డి, మోహన్‌రెడ్డి తదితరులు రామలింగేశ్వరుడు, పార్వతీదేవి విగ్రహాలను రథంపై ఉంచి రథోత్సవాన్ని ప్రారంభించారు. అలాగే భోగలింగేశ్వర ఆలయంలో శివపార్వతులకు బొంబాయి రమేష్ నాయుడు కల్యాణం జరిపించారు.

శివపార్వతుల కల్యాణోత్సవం

పామిడి: పట్టణంలోని చిన్న విఠోబదేవాలయంలో రంగసుభే ఫిర్కా, భావసార క్షత్రియ సమాజ్ సంయుక్త ఆధ్వర్యంలో శివపార్వతుల సామూహిక కల్యాణోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఆలయ కమిటీ సభ్యులు టీటీ నాగభూషణం, శ్రీనివాసులు, ఆలయ అర్చకులు, సమాజ్ సభ్యులు పాల్గొన్నారు.

ఉమామహేశ్వరుల కళ్యాణమహోత్సవం

గార్లదిన్నె: మండలంలోని యర్రగుంట్లలో ఉన్న వీరబ్రహ్మేంద్ర స్వామి ఆలయం వద్ద శనివారం ఉమామహేశ్వరుల కల్యాణం ఘనంగా నిర్వహించారు. అనంతరం భక్తుల సౌకార్యార్థం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

ఘనంగా చితంబర స్వామి తిరునాల

గార్లదిన్నె/బుక్కరాయసముద్రం/పెద్దపప్పూరు: గార్లదిన్నె మండలంలోని పెనకచెర్లలో చితంబర స్వామి తిరునాల శనివారం ఘనంగా నిర్వంచారు. రాత్రి స్వామి రథోత్సవం వైభవంగా చేపట్టారు. కమిటీ సభ్యులు భక్తులకు అన్నదానం చేశారు. అలాగే బుక్కరాయసముద్రం, పెద్దపప్పూరు మండలాల్లో శివరాత్రి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి.

నేడు బుగ్గ రామలింగేశ్వరుడి కల్యాణం, రథోత్సవం

తాడిపత్రి అర్బన్: శివరాత్రి బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆదివారం బుగ్గ రామలింగేశ్వరుడి కల్యాణోత్సవం నిర్వహించనున్నారు. ఉదయం 9గంటలకు ఆలయం ప్రాంగణంలో ఏర్పాటు చేసిన మండపంలోని వేదికపై పార్వతీ పరమేశ్వరుల కల్యాణోత్సవం జరగనుంది. వేసవి దృష్ట్యా భక్తులు ఇబ్బంది పడకుండా ఆలయ కమిటీ సభ్యులు చలువ పందిళ్లు వేశారు. అనంతరం భక్తులకు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించనున్నారు. మధ్యాహ్నం 2గంటలకు బుగ్గరామలింగేశ్వర స్వామి రథోత్సవాన్ని నిర్వహించనున్నారు. ఇప్పటికే రథాన్ని సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దారు.



యాడికిలో రథాన్ని లాగుతున్న భక్తులు



పామిడిలో శివపార్వతుల కల్యాణోత్సవ దృశ్యం



గార్లదిన్నె: యర్రగుంట్లలో ఉమామహేశ్వరుల కల్యాణోత్సవ దృశ్యం



గార్లదిన్నె మండలం పెనకచెర్లలో తిరునాల సందర్భంగా అలంకరణలో చితంబర స్వామి



బుక్కరాయసముద్రం: గోవిందపల్లిలో అన్నదాన కార్యక్రమం నిర్వహిస్తున్న దృశ్యం

సీఎం జగన్‌ను మళ్లీ ఆశీర్వదించండి

గుంతకల్లు రూరల్: బడుగు, బలహీన వర్గాల సంక్షేమం కోసం పాటుపడుతున్న ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డికి ప్రజలు అండగా నిలవాలని మరోసారి ఆయన్ని ముఖ్యమంత్రిగా గెలిపించాలని ఎమ్మెల్యే వై.వెంకట్రామిరెడ్డి విజ్ఞప్తి చేశారు. మండలంలోని దోసలుడుకి గ్రామ పంచాయతీలో రూ.44.74 లక్షలతో నూతనంగా నిర్మించిన రైతు భరోసా కేంద్రం, వైఎస్సార్ హెల్త్ క్లినిక్‌ను ఆయన ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ ప్రతి పేదవాడికీ లబ్ధి చేకూర్చడమే లక్ష్యంగా రాష్ట్రంలో ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి పాలన కొనసాగుతోందన్నారు. దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి అడుగుజాడల్లో నడుస్తూ రైతు, ప్రజా సంక్షేమం ధ్యేయంగా సచివాలయాలు, రైతు భరోసా కేంద్రాలు, వైఎస్సార్ హెల్త్ క్లినిక్‌ల ద్వారా సీఎం జగన్ ప్రజల వద్దకే పాలనను తీసుకువచ్చారన్నారు. ప్రతి హామీనీ నెరవేరుస్తూ ప్రజలకు ఎంతోమేలు చేస్తున్న జగన్‌ను మరోసారి గెలిపించుకోవాలని, అప్పుడే మరింత మెరుగైన పాలన అందుతుందన్నారు. దుష్టశక్తులన్నీ ఏకమై జగనన్నను ఓడించాలని కుయుక్తులు పన్నుతున్నాయన్నారు. బీజేపీతో పొత్తుకోసం అపాయింట్‌మెంట్ ఇవ్వకపోయినా వారితో కాళ్లబేరం చేస్తున్నారన్నారు. గుంతకల్లు నియోజకవర్గంలో తెలుగుదేశం పార్టీకి నాయకులే లేరన్నట్లు పక్క జిల్లాల నుంచి తీసుకువచ్చే ప్రయత్నం చేస్తోందన్నారు. అక్రమాలు, అరాచకాలకు పాల్పడే వ్యక్తులకు ఇక్కడ స్థానం లేదన్నారు. ప్రస్తుతం 2 వేల క్యూసెక్కుల సామర్థ్యం ఉన్న హంద్రీనివా కాలువను ప్రభుత్వం 6 వేల క్యూసెక్కులకు పెంచే యోచన చేస్తుందని, వచ్చే ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ గెలిచాక నియోజకవర్గంలో ఎక్కడా కూడా తాగు, సాగునీటి సమస్య తలెత్తకుండా చేస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ఎంపీపీ బీవీ మాధవి, మార్కెట్ యార్డు చైర్మన్ ఎస్వీఆర్ మోహన్, సర్పంచులు జయలక్ష్మి, మోతమ్మ, మురహరి నాయుడు, ఎంపీడీఓ శ్రీకాంత్ చౌదరి, మండల ఇంజినీర్ ఓబులేసు, మండల కన్వీనర్ మోహన్ రావు, నాయకులు యోగానందరెడ్డి, నాగేష, వై.మల్లికార్జున, రమేష్‌నాయక్, ఎంపీటీసీ నాగప్ప, కో ఆప్షన్ సభ్యుడు సిపాయి బాషా, జీవన్ కుమార్, రామ్మోహన్‌రెడ్డి, వెంకట్రాముడు, నాగప్ప, దేవేంద్ర, సుక్కే సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.



శిలాఫలకం ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే వైవీఆర్

సీఎంఆర్‌ఎఫ్ చెక్కుల పంపిణీ

గుంతకల్లుటౌన్: పట్టణంలోని హనుమేష్‌నగర్‌కు చెందిన షేక్ మహమ్మద్ రసూల్‌కు సీఎం సహాయనిధి కింద మంజూరైన రూ.2 లక్షల విలువ చేసే చెక్కులను ఎమ్మెల్యే వై.వెంకటరామిరెడ్డి అందజేశారు. శనివారం ఎమ్మెల్యే వైవీఆర్ తన నివాసంలో షేక్ మహమ్మద్ రసూల్ కుటుంబసభ్యులకు రూ.2 లక్షల చెక్కు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు సీఎం జగన్, ఎమ్మెల్యే వైవీఆర్‌లకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో వైస్ చైర్‌పర్సన్ నైరుతిరెడ్డి, కోఆప్షన్‌సభ్యుడు రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.



పార్టీలో చేరిన టీడీపీ నాయకులతో ఎమ్మెల్యే వైవీఆర్

టీడీపీ నుంచి వైఎస్సార్‌సీపీలో చేరిక

గుత్తి రూరల్: మండలంలోని బేతాపల్లికి చెందిన పలువురు టీడీపీ నాయకులు వైఎస్సార్‌సీపీలో చేరారు. శనివారం గుంతకల్లు పట్టణంలోని ఎమ్మెల్యే స్వగృహంలో జరిగిన కార్యక్రమంలో గ్రామానికి చెందిన టీడీపీ క్రియాశీలక కార్యకర్తలు కుమ్మర వీరనారాయణ, నారాయణస్వామి, రామకృష్ణ, పెద్దరాజు, లక్ష్మినారాయణ, చిన్నరాజుతో పాటుగా 20 కుటుంబాలకు చెందిన వారు పార్టీ తీర్థం పుచ్చుకున్నారు. పార్టీలో చేరిన వారికి ఎమ్మెల్యే వై.వెంకట్రామిరెడ్డి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. పార్టీలో చేరిన వారు మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డి అనేక సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టి అన్ని వర్గాల వారికి న్యాయం చేస్తున్నారన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు వెంకటేశ్వరరెడ్డి, రామిరెడ్డి, హరికృష్ణ, గంగరాజు, దస్తగిరి, ఎస్సీ సెల్ మండల అధ్యక్షుడు ఆంజనేయులు పాల్గొన్నారు.

చంద్రబాబును నమ్మి మోసపోవద్దు



పట్టాలను పంపిణీ చేస్తున్న మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి. చిత్రంలో ఎమ్మెల్యే కేతిరెడ్డి, ఫయాజ్‌బాషా

తాడిపత్రిరూరల్: చంద్రబాబు మాయమాటలు నమ్మి ప్రజలు మోసపోవద్దని మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి సూచించారు. పట్టణంలోని పాత ఈద్గా మైదానంలో శనివారం ఫయాజ్‌బాషా ట్రస్టు ద్వారా 232 మందికి ఇళ్ల పట్టాల పంపిణీ కార్యక్రమానికి మంత్రి హాజరయ్యారు. మంత్రి మాట్లాడుతూ అధికారం కోసం రెండుసార్లు చంద్రబాబు అమలు కాని హామీలతో ప్రజలను మోసం చేశారన్నారు. మరోసారి అధికారం కోసం అమలు చేయలేని హామీలను ఇస్తున్న విషయాన్ని ప్రజలు గుర్తుపెట్టుకుని వచ్చే ఎన్నికల్లో గుణపాఠం చెప్పాలన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రజల సంక్షేమం కోసం పనిచేస్తున్నారన్నారు. రాష్ట్రంలో 32 లక్షల మందికి పట్టాలు మంజూరు చేసి, ఇళ్లు నిర్మించి ఇస్తున్నారన్నారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ తాడిపత్రిలో మైనార్టీల జీవితాలతో జేసీ ప్రభాకర్‌రెడ్డి ఆటలాడుకుంటున్నారన్నారు. పట్టణంలోని సీబీ రోడ్డులో ఉన్న సిద్దిబాషా దర్గా మీనార్‌ను జేసీ నిర్దాక్షిణ్యంగా కూల్చివేయించారన్నారు. జేసీ హయంలో తాడిపత్రిలో మట్కా, రౌడీజం ఎక్కువగా ఉండేదన్నారు. వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చిన వెంటనే అరాచకశక్తులను అణచివేసి మట్కాను అరికట్టామన్నారు. ట్రస్టు చైర్మన్ ఫయాజ్‌బాషా మాట్లాడుతూ కోట్లాది రూపాయల విలువైన భూమిని 232 మంది పేద ప్రజలకు పట్టా రూపంలో అందిస్తున్నామన్నారు. ట్రస్టు ద్వారా సేవా కార్యక్రమాలను విరివిగా నిర్వహిస్తామన్నారు. అంతకుముందు మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డిని ఫయాజ్‌బాషాతో పాటు ముస్లిం పెద్దలు సన్మానించారు. కార్యక్రమంలో ఎంపీ మిథున్‌రెడ్డి, అనంతపురం పార్లమెంట్ ఇన్‌చార్జ్ శంకరనారాయణ, జిల్లా అధ్యక్షుడు పైలా నరసింహయ్య, రాష్ట్ర కార్యదర్శులు రమేష్‌రెడ్డి, పేరం స్వర్ణలత, కదిరి ఇన్‌చార్జ్ ముక్బూల్, నాయకులు బొంబాయి రమేష్, జగదీశ్వరరెడ్డి, కాకర్ల రంగనాథ్ తదితరులు పాల్గొన్నారు.

ఈ సారైనా జేసీ అధ్యక్షత వహించేనా?

- వైస్ చైర్మన్లతో నడిపిస్తూ తరచూ డుమ్మా
- సాక్షి కథనంతో చైర్మన్, మునిసిపల్ అధికారుల్లో కదలిక
- రేపు మున్సిపల్ బడ్జెట్ సమావేశం

తాడిపత్రిరూరల్: సాక్షి కథనంతో మున్సిపల్ చైర్మన్ జేసీ ప్రభాకర్‌రెడ్డి, అధికారుల్లో చలనం వచ్చింది. ఈ నెల 5న సాక్షిలో 'ప్రజలను వంచన జేసీ' కథనం వచ్చింది. చైర్మన్ స్థాయిలో ఉండి మున్సిపాలిటీ, కౌన్సిల్ సమావేశాలను గాలికి వదిలి తనయుడు అస్మిత్‌రెడ్డి కోసం నియోజకవర్గంలో బస్సుయాత్ర చేపట్టడంపై ప్రజల్లో తీవ్ర అసంతృప్తి, నిరసన వ్యక్తమైంది. ఈ ప్రభావం ఎన్నికల ఫలితాలపై చూపుతుందన్న భయమో లేకుంటే త్వరలో ఎన్నికల కోడ్ రానుండటమో తెలియదు కానీ యుద్ధప్రాతిపదిన ప్రజల సమస్యలపై అజెండా, బడ్జెట్ అంచనాల తయారీపై కసరత్తు ప్రారంభించి సోమవారం కౌన్సిల్ సమావేశంలో ప్రవేశపెట్టడానికి ఆధికారులు సన్నద్ధం ఆయ్యారు. ఇప్పటికే అధికార, ప్రతిపక్ష కౌన్సిలర్లు, కో-ఆప్షన్ మెంబర్లు తదితరులకు అజెండా కాపీలను పంపిణీ చేశారు.



మునిసిపల్ కార్యాలయం

ఆలస్యంగా బడ్జెట్ సమావేశం

గతంలో ఎన్నడు లేని విధంగా నెలరోజులకు పైగా ఆలస్యంగా మున్సిపల్ బడ్జెట్ సమావేశం జరుగనుంది. చైర్మన్ ఏక పక్ష నిర్ణయాలను అజెండాలో పెట్టడానికి గత కమిషనర్ నిరాకరించడంతోనే బడ్జెట్ సమావేశం అలస్యం కావడానికి కారణమైంది. గతంలో ఆయన ఎమ్మెల్యే, చైర్మన్, వైస్ చైర్మన్‌గా ఉన్న సమయంలో అధికారులను గుప్పెట్లో పెట్టుకుని పాలన కొనసాగించేవారు. వైఎస్సార్ సీపీ ఆధికారంలోకి రావడంతోపాటు కౌన్సిల్‌లో బలమైన వైఎస్సార్ సీపీ ప్రతిపక్షం ఉండటంతో జేసీ ఆటలు సాగలేదు. ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డిని సమన్వయం చేసుకుని రాష్ట్ర ప్రభుత్వం నుంచి మున్సిపాలిటీకి రావాల్సి నిధులు, గ్రాంట్‌లను తెప్పించుకొని తాడిపత్రి అభివృద్ధికి కృషి చేయాల్సింది పోయి.. నిత్యం గిల్లికజ్జాలు పెట్టుకోవడం, బురుదజల్లే ప్రయత్నాలు చేయడంతోనే జేసీ కాలం గడుపుతూ వస్తున్నారు. కాగా మరో 20రోజుల్లో ఏప్రిల్ నెల రానుంది. ఇంత తక్కువ సమయంలో తయారు చేసిన బడ్జెట్‌పై ప్రజల్లో పలు సందేహాలు తలెత్తుతున్నాయి.

బడ్జెట్ సమావేశానికి హాజరవుతారా..

మున్సిపాలిటీ అభివృద్ధికి దిశ, దశను నిర్దేశించే బడ్జెట్ సమావేశానికైె చైర్మన్ జేసీ ప్రభాకర్‌రెడ్డి హజరవుతారా లేక షరా మాములే అన్నట్లు శంఖారావం ఏర్పాటు పేరుతో మరోసారి డుమ్మా కొట్టి వైస్ చైర్మన్లతో మమా అనిపిస్తారా అన్న ప్రశ్నలు తలెత్తుతున్నాయి. ఆరునెలల తరువాత కౌన్సిల్ సమావేశం జరుగనుండటంతో సమస్యలపై నిలదీసేందుకు వైఎస్సార్‌సీపీ కౌన్సిలర్లు సిద్ధంగా ఉన్నారు., వైఎస్సార్‌సీపీ నాయకుడు, 31వ వార్డు కౌన్సిలర్, ఎమ్మెల్యే తనయుడు హర్షవర్ధన్‌రెడ్డి మాట్లాడుతూ త్వరలో ఎన్నికల కోడ్ వస్తుందని, బడ్జెట్ సమావేశం ఇప్పుడు నిర్వహించకపోతే మరో రెండు నెలల పాటు నిర్వహించేదుకు వీలులేదన్న అలోచనతో జరుపుతున్నావు తప్ప ప్రజల అవసరాల కోసం కాదన్నారు. అసలు జేసీ సమావేశానికి హాజరవుతావన్న నమ్మకం లేదన్నారు.

సచివాలయాల ద్వారా సత్వర పరిష్కారం



జూటూరులో సచివాలయాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి




చెక్కులను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే పెద్దారెడ్డి

పెద్దపప్పూరు: ప్రజలకు సత్వర పరిష్కారం చూపాలన్న లక్ష్యంతో సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ప్రతి పంచాయతీలో రూ.లక్షల వ్యయంతో సచివాయాల నిర్మాణం చేపట్టారని తాడిపత్రి ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి అన్నారు. శనివారం ఎమ్మెల్యే జూటూరులో పర్యటించి నూతనంగా నిర్మించిన గ్రామ సచివాలయం, విలేజ్ హెల్త్ క్లినిక్, సొసైటీ భవనాలను ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ జేసీ సోదరులు 35 ఏళ్ల రాజకీయ అనుభవమని చెప్పుకుంటున్నారే కానీ సొంత గ్రామంలో అభివృద్ధి పనులు చేయలేదన్నారు. వైఎస్సార్‌సీపీ అధికారంలోకి రాగానే చాగల్లు, ముచ్చుకోట, పెండేకల్లు రిజర్వాయర్లకు నీరు ఇవ్వడంతో బోరుబావుల్లో భూగర్భజలాలు పెరిగి బీడుభూములు సాగులోకి వచ్చాయన్నారు. నియోజకవర్గ వ్యాప్తంగా కుల మతాలు, రాజకీయాలు లేకుండా సీఎం జగనన్న అర్హులందరికీ సంక్షేమ పథకాలను వర్తింపజేశారన్నారు. అభివృద్ధి చేసిన ప్రభుత్వానికే ప్రజలు పట్టం కడతారని, ఉచిత హామీలిచ్చి నెరవేర్చని నాయకులను ప్రజలు నమ్మే పరిస్థితిలో లేరన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ వెంకటరామిరెడ్డి (రామయ్య), జిల్లా పార్లమెంటు జనరల్ సెకరట్రీ రవిప్రసాద్ రెడ్డి, మాజీ ఎంపీపీ రామ్మూర్తి రెడ్డి, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ అమర్‌నాథ రెడ్డి, జేఏసీ కన్వీనర్ పెద్దిరెడ్డి, కోఆప్షన్ సభ్యుడు హాజీవలి, యర్రగుడి రామ్మోహన్‌రెడ్డి, వినయ్‌కుమార్ రెడ్డి, ఎర్రగుడి రవికుమార్‌రెడ్డి, జేసీ విష్ణువర్ధన్‌రెడ్డి, నామనాంకపల్లి రఘునాథరెడ్డి, వివిధ గ్రామాల నాయకులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కుల పంపిణీ

తాడిపత్రిరూరల్: పట్టణ, మండల, పెద్దపప్పూరు మండలాల్లోని బాధిత కుటుంబాలకు శనివారం ఎమ్మెల్యే పెద్దారెడ్డి ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులను పంపిణీ చేశారు. పట్టణంలోని హరిజనవాడ, రెడ్డివారిపాలెం, శ్రీనివాసపురం, పోరాటకాలనీ, మండలంలోని గన్నెవారిపల్లికాలనీ, కొనుగుంటపల్లి, ఇగుడూరు, రావివెంకటాంపల్లి, పెద్దపప్పూరు మండలంలోని చీమలవాగులపల్లి గ్రామాల్లోని 11 మందికి రూ.9 లక్షల విలువ చేసే చెక్కులను పంపిణీ చేశారు.

సీఎం జగన్‌తోనే సంక్షేమం, అభివృద్ధి



గార్లదిన్నెలో పర్యటించిన సమన్వయకర్త వీరాంజనేయులు

గార్లదిన్నె: రాష్ట్రంలో పేదలకు మేలు జరగాలన్నా, సంక్షేమ పథకాలు పేదలకు అందాలన్నా, రాష్ట్రంలో అభివృద్ధి ముందుకు సాగాలన్నా మరోసారి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని ముఖ్యమంత్రిని చేసుకోవాలని శింగనమల నియోజకవర్గ సమన్వయ కర్త వీరాంజనేయులు అన్నారు. శనివారం మండల కేంద్రం గార్లదిన్నె, జంబులదిన్నె, జంబులదిన్నెకొట్టాల, ఓబులాపురంలో ఆయన పర్యటించారు. ఆయన మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి 99 శాతం హామీలు అమలు చేశారన్నారు. గతంలో చంద్రబాబు ఎన్నికల హామీలను తుంగలో తొక్కి ఏ విధంగా ప్రజలను మోసం చేశారో ప్రతి ఒక్కరూ గుర్తించుకోవాలన్నారు. సంక్షేమ పథకాలు కొనసాగాలంటే జగన్‌ను మళ్లీ ముఖ్యమంత్రి చేసుకోవాలన్నారు. మండల కన్వీనర్ నరేంద్రరెడ్డి, వైస్ ఎంపీపీ కుంచం రామ్మోహన్‌రెడ్డి, జంబులదిన్నె సొసైటీ చైర్మన్ సుధాకర్ రెడ్డి, బీఎస్ రామాంజనేయులు, ఎస్సీ సెల్ మండల అధ్యక్షుడు లక్ష్మీనారాయణ, నాయకులు పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం

దరఖాస్తుల ఆహ్వానం

పుట్లూరు/యల్లనూరు: మండలకేంద్రంలోని కేజీబీవీలలో ఆరో తరగతి ప్రవేశం కోసం ఈ నెల 12 నుంచి దరఖాస్తు చేసుకోవాలని ఎంఈఓలు శ్రీదేవి, చంద్రశేఖర్ శనివారం వేర్వేరు ప్రకటనల్లో పేర్కొన్నారు. 6వ తరగతి, ఇంటర్ మొదటి సంవత్సరంతో పాటు 7, 8, 9వ తరగతుల్లో మిగిలిన సీట్ల భర్తీ చేస్తామన్నారు. ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలన్నారు.

శింగనమలలో వైద్య శిబిరం

శింగనమల: ప్రజలు విష జ్వరాల బారిన పడుతుండడంతో శనివారం తరిమెల పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్. శంకర్ నాయక్ ఆధ్వర్యంలో మండల కేంద్రంలో వైద్య శిబిరం నిర్వహించారు. గొల్ల వీధి, మసీదు ప్రాంతంలో ఇంటింటికీ వెళ్లి వైద్య పరీక్షలు చేసి, అవసరమైన వారికి మందులను పంపిణీ చేశారు. వీధిలోని డ్రైనేజీలను ఈఓఆర్డీ మురళీకృష్ణ, పంచాయతీ కార్యదర్శి రామాంజనేయులు ఆధ్వర్యంలో , పంచాయతీ కార్మికులు శుభ్రం చేశారు.

మహిళాభ్యున్నతికి కృషి చేయాలి

పెద్దవడుగూరు: మహిళా అభ్యున్నతికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఎంపీపీ శ్రీదేవి, ఎస్‌ఐ శ్రీనివాసులు, ఆర్డీటీ ఏటీఎల్ నారాయణ సూచించారు. శనివారం మండలంలోని ఆర్డీటీ పాఠశాలలో అంతర్జాతీయ మహిళా దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేశారు. అనంతరం అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళ్ళు అర్పించారు. కార్యక్రమంలో ఆర్డీటీ సీఓ మంజుల, క్రిష్టిపాడు సీఓ నాగరత్నమ్మ మహిళా సంఘాల సభ్యులు, సిబ్బంది, పాల్గొన్నారు.

నిందితుడికి రిమాండ్

గార్లదిన్నె: హత్యాయత్నం కేసులో నిందితుడిని పోలీసులు రిమాండ్‌కు తరలించారు. మండలంలోని పెనకచెర్లకు చెందిన ఎర్రిస్వామిపై శుక్రవారం హత్యాయత్నం కేసు నమోదైన విషయం విదితమే. జమేదార్ ఫిరోజ్ ఖాన్ మాట్లాడుతూ హత్యాయత్నం కేసులో నిందితుడిని ఇన్‌చార్జ్ ఎస్‌ఐ రాజశేఖరరెడ్డి శనివారం అనంతపురంలోని తపోవనం సర్కిల్లో అరెస్ట్ చేశారన్నారు. అతడిని జిల్లా కోర్టులో హాజరు పరుచగా జడ్జి 14 రోజులు రిమాండ్ విధించారన్నారు. నిందితున్ని రెడ్డి పల్లి సబ్‌జైలుకు తరలించామన్నారు.

విద్యుత్ తీగలు దగ్ధం

గుత్తి రూరల్: మండలంలోని కొత్తపేటలో రైతులు అనిల్, సాదిక్‌కు చెందిన విద్యుత్ తీగలు, మోటార్లు కాలిపోయాయి. గ్రామ శివారులో బైపాస్ బ్రిడ్జ్ వద్ద ఉన్న వారి పొలాల్లో శుక్రవారం అర్ధరాత్రి గుర్తు తెలియని వ్యక్తులు కంప చెట్లు, చెత్తకు నిప్పు పెట్టడంతో భారీ ఎత్తున మంటలు చెలరేగాయి. విద్యుత్ తీగలు, మోటార్లు కాలిపోవడంతో సుమారు రూ.50 వేలు నష్టం వాటిల్లినట్లు బాధిత రైతులు పోలీసులకు ఫిర్యాదు చేశారు.